క్లుప్తంగా

కొత్తపేటలో ఓటర్ల అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో శనివారం ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఓటుహక్కు ప్రాముఖ్యతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత విలువ ఉందని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం



సీసీ రహదారి పనులను పర్యవేక్షిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ రెడ్డికవీధిలో సీసీ రహదారి, డ్రైన్ల నిర్మాణాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు మాట్లాడుతూ, రూ.3.50 లక్షల నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. అన్ని వసతులు కల్పించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జగ్గరాజుపేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కల్యాణం లక్ష్మునాయుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం గ్రామానికి చేరుకుని లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నగర పంచాయతీ పరిధిలోని కారుకొండ ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ వర్సిటీని సందర్శించిన కలెక్టర్



సెంచూరియన్ వర్సిటీలో భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీను కలెక్టర్ నాగలక్ష్మి సెల్వమణి శనివారం సందర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలనలో భాగంగా వర్సిటీని సందర్శించి వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతితో చర్చించారు. భవనాలు, వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో అనిత, ఆర్‌డీఓ సూర్యకళ పాల్గొన్నారు.

జొన్నవలసలో హౌసింగ్ డే



జగనన్న కాలనీ నిర్మాణాల వద్ద అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అధికారులు పర్యటించి జగనన్న కాలనీలో గృహనిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అధికారి అరుణకుమారి మాట్లాడుతూ, ఇంకా నిర్మాణాలు పూర్తి చేయని వారు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, ఉపాధి ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం



పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తోటపాలెం బాలాజీనగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో రూ.7.80 లక్షలతో మంజూరు చేసిన ఐదు పట్టణ ప్రగతి కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. పేపర్ ప్లేట్ల తయారీ, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, క్లాత్ బ్యాగ్స్ తయారీ, స్క్రీన్ ప్రింటింగ్ కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించి, సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించేందుకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తూ, మహిళల్లో చైతన్యాన్ని తీసుకువస్తున్నారని తెలిపారు. మహిళల పేరిటే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయడం గొప్ప విషయమని అభివర్ణించారు. నగరంలో అనేక ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. చెరువులు, రహదారులు, ప్రధాన జంక్షన్లు, పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా విజయనగరానికి రాష్ట్రంలోనే సముచిత స్థానం దక్కిందని తెలిపారు. రాష్ట్రంలోని ఎక్కడా లేనివిధంగా నగరంలో మహిళా పార్కు ఏర్పాటు చేశామన్నారు. గతంలో తాగునీటికి మహిళలు అనేక అవస్థలు ఎదుర్కొనేవారని, అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు విడిచి రోజు నీటిని పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్, కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, మెప్మా పీడీ సుధాకరరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు జీవీ రంగారావు, రేగాన రూపాదేవి, గాదం మురళి, జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, మారం బాలబ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

• కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు

విజయనగరం: ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించి సచివాలయాల ఔన్నత్యాన్ని మరింత ఇనుమడింపజేయాలని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు కార్యదర్శులకు సూచించారు. నగరంలోని 40వ నంబర్ సచివాలయాన్ని శనివారం ఆయన పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలను ఏ విధంగా అమలు చేస్తున్నారన్న విషయమై ఆరా తీశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



చెరుకూరి రాజ్యలక్ష్మికి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్లు

విజయనగరం: ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వం అందించే వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారు. నగరంలోని 14వ డివిజన్ 17వ సచివాలయం పరిధిలోని కొత్తపేట ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల చెరుకూరి రాజ్యలక్ష్మి విశాఖ కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా... ఫిబ్రవరి నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్ మొత్తాన్ని స్థానిక వలంటీర్‌లు మానేపల్లి త్రివేణి, బొత్స మాధురి శనివారం అందజేశారు. విశాఖ వెళ్లి పింఛన్ అందజేయడంతో వలంటీర్లను పలువురు అభినందించారు.

అరకొర నిధుల కేటాయింపు తగదు



ఉపాధి వేతనదారులతో కలిసి నిరసన తెలియజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి అరకొర నిధులు మంజూరు చేయడం అన్యాయమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. మండలంలోని కొండగుంపాంలో ఉపాధిహామీ వేతనదారులతో కలిసి శనివారం నిరసన తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలకు అనేక రాయితీలు ప్రకటించిన మోదీ ప్రభుత్వం కార్మికులు, ఉపాధి వేతనదారులకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఏడాదికి 200 రోజులు ఉపాధి పనులు కల్పించడంతో పాటు రోజుకి రూ.200 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోలిపల్లి సూరి, పైడినాయుడు, చిన్నప్పడు, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ముందుకెళ్లాలి..



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు ఐక్యమత్యంగా సాగుతూ సమస్యలను పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌ఓబీ వద్ద మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరసన మూడో రోజైన శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ మిమ్స్ ఉద్యోగుల నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మిమ్స్ యాజమాన్యం మొండితనం వీడి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, కిల్లంపల్లి రామారావు, మిరప నారాయణరావు, వి.ఆదినారాయణ, రామకృష్ణ, కామునాయుడు, నర్సింగరావు, రమణ, వరలక్ష్మి, గౌరి, భవానీ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు..

నెల్లిమర్ల: సీఐటీయూ ప్రతినిధి టీవీ రమణ చేసినవన్నీ తప్పుడు ఆరోపణలన్నీ, ఉద్యోగులు వాటిని నమ్మకుండా విధులకు హాజరుకావాలని మిమ్స్ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉద్యోగులందరికీ క్రమం తప్పకుండా కనీస వేతనాల చట్టం ప్రకారం వీడీఏతో కలిపి ప్రతి ఏడాదీ ఇంక్రిమెంట్ వేస్తున్నట్లు పేర్కొంది. గతంలో టీవీ రమణ కరోనా సమయంలో ఉద్యోగులను తప్పుదోవ పట్టించి, కలెక్టర్ ఆదేశాలను సైతం ధిక్కరించి ఉద్యోగులతో సమ్మె చేయించారని ఆరోపించింది. ఆ సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన కొందరు సీఐటీయూ యూనియన్‌ను బహిష్కరించి, యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కరించుకున్నారని తెలిపింది. అయితే టీవీ రమణ కక్ష సాధింపు ధోరణితో కొంత మంది ఉద్యోగులను సమీకరించి మళ్లీ మిమ్స్ ఉద్యోగులకు తప్పుడు సలహాలు ఇస్తూ వారిని రెచ్చగొడుతున్నారని ఆరోపించింది.

అన్ని రంగాలపై అవగాహన అవసరం

డెంకాడ: విద్యార్థులు అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండటం చాలా మంచిదని అక్కివరం పంచాయతీ గొల్లపేట ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అన్నారు. మోటారు సైకిళ్ల నిర్వహణ, మరమ్మతులపై అవగహన కార్యక్రమంలో భాగంగా భోగాపురం మండలంలోని గురుమూర్తి బైక్ గ్యారేజీని పాఠశాల 9వ తరగతి విద్యార్థులు శనివారం సందర్శించారు. మోటారు సైకిల్‌లో వివిధ రకాల విభాగాలు, వాటి పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఎస్.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని ఒంటితాడి అగ్రహారం సబ్‌స్టేషన్‌కు వస్తున్న 132కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటల మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

విజయనగరం క్రైమ్: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను జీఆర్‌పీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ అందించిన వివరాలిలా ఉన్నాయి. సిబ్బంది రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తుండగా.. బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తి రాయగడ నుంచి బొబ్బిలికి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి పది బీరు బాటిళ్లు, ఆరు విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

రామతీర్థంలో అలరించిన భక్తి కళారాధన



స్వామి సన్నిధిలో భజనలు చేస్తున్న కళాకారులు

నెలిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన భక్తి కళారాధన భక్తులను అలరించింది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శ్రీవేంకటేశ్వర భజన కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో పలు భక్తి గీతాలను ఆలపిస్తూ భజనలు నిర్వహించారు. కళాకారులను దేవస్థాన అధికారులు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం అధ్యక్షుడు అట్టాడ పైడిరాజు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో సత్య విద్యాసంస్థల సిబ్బంది

విజయనగరం అర్బన్: తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గత విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ప్రతిభా పురస్కారాలు అందజేసింది. మజ్జి రామారావు, కళావతమ్మ, బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ దంపతుల మెమోరియల్ స్కాలర్‌షిప్ – 2024లో భాగంగా ఒక్కో విద్యార్థికి రూ.5 వేల నగదు, పురస్కారాలు శనివారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



పూసపాటిరేగ: రెల్లివలసలో సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ మహోన్నత పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం సమీపంలో ఉన్న చెరువు కొమ్ము గొల్లపేటలో ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శనివారం లాంఛనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 163 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసినట్లు చెప్పారు. పేద ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో సీఎం జగనన్న దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2019 సార్వత్రిక ఎన్నికల ముందు హడావిడి చేస్తూ పేదలకు ఇళ్ల స్థలాలు చూపించకుండా పట్టాలను పంపిణీ చేసి మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ స్థలాలు మంజూరు చేశామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. అలాగే పక్కా ఇంటి నిర్మాణానికి కూడా రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కొమ్మూరు సుభోషణరావు, నడుపూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ న్యాయం..

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రెల్లివలసలో సుమారు 45 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, రూ. 46 లక్షలతో చల్లవానితోట, కుమిలిలో నిర్మించిన వెల్‌నెస్ భవనాలను, రూ. 22 లక్షలతో సీహెచ్ అగ్రహారంలో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. అలాగే రెల్లివలస ఎస్సీ కాలనీలో సుమారు రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్యరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని, అటువంటి సంక్షేమ సారథిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, ఏఎంసీ చైర్మన్ చిక్కాల అరుణ కుమారి, వైస్ ఎంపీపీలు ఎస్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, మొంగం నాగబాబు, చిక్కాల సాంబశివరావు, అప్పడుదొర, టి. సీతారాం, కొత్తకోట శ్రీరాములు, గుజ్జు సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి, డి. గణేష్, గొర్లె రమణ, ఇజ్జురోతు రామునాయుడు, ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ ప్రవల్లికప్రియ, పీఆర్ డీఈ బంగారునాయుడు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జీవన గమనానికి అంగవైకల్యం అడ్డుకారాదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం తన నివాసంలో నగరానికి చెందిన ముగ్గురు దివ్యాంగులకు రెండు బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఒక సాధారణ ట్రై సైకిల్‌ను అందజేశారు. 2వ డివిజన్‌కు చెందిన పిన్నెల్లి సత్తిబాబు, 3వ డివిజన్‌కు చెందిన గంగా ధనమ్మ, 18వ డివిజన్‌కు చెందిన శిమిడి పెంటంనాయుడులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మీసాల రమాదేవి మాట్లాడుతూ.. అంగవైకల్యం శరీరానికి గాని మనసుకు కాదన్న విషయం గ్రహించాలన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుత రోజుల్లో అంగవైకల్యం ఉన్నవారే ఎన్నో విజయాలు సాధిస్తున్నారని, అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు లభిస్తున్నాయంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలే కారణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక వరలక్ష్మి, దేశెట్టి మోహనరావు, పిల్లా రామకృష్ణ, వేముల శివప్రసాద్, మెండా రమణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

• అవగాహన ర్యాలీలో డీటీసీ రవీంద్రనాథ్



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌టీఓ కార్యాలయ సిబ్బందితో పాటు ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు

విజయనగరం గంటస్తంభం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రాంతీయ రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డుపై వాహనాలు నడిపే వారే కాకుండా పాదచారులు సైతం రహదారి భద్రతా నియమాలను తెలుసుకోవాలన్నారు. వీటిపై అందరికి సంపూర్ణ అవగాహన ఉంటే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సీఐ రంగనాథ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, మయూరి జంక్షన్, సంతకాల సేకరణ వంతెన, కలెక్టర్ ఆఫీస్, ఆర్‌టీఓ కార్యాలయం వరకు సాగింది. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్, ఎంవీఐలు ఏవీ రమణ, యు.దుర్గాప్రసాద్, కేఆర్ ఎస్పీ ప్రసాద్, ఏఎంవీఐలు, వి.శ్రావ్య, వి.ఐశ్వర్య లక్ష్మి, సిబ్బంది, భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.